క్లుప్తంగా

యూరియా కొరత తీర్చాలని ధర్నా



అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి సింగిల్‌విండో వద్ద మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. రైతులకు యూరియా కొరత తీర్చాలని డిమాండ్ చేస్తూ కార్యాలయం ఎదుట బైఠాయించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సింహ, మాజీ జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, కొండయ్య, శివరాములు, రవీందర్‌గౌడ్, పెద్ద వెంకటయ్య, రఘురాములు ఉన్నారు.

పట్టణంలో విస్తృత తనిఖీ



మహబూబ్‌నగర్ క్రైం: వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో డాగ్‌స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, క్లాక్ టవర్ చౌరస్తా, ఆకుల చౌరస్తా, మెట్టుగడ్డ తదితర రద్దీ ప్రాంతాల్లో బాంబ్ డిస్పోసల్ టీం సోదాలు చేశారు. ప్రయాణికుల బ్యాగులు ఇతర సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించారు.

రైతులకు బోనస్ ఇవ్వాలి

అడ్డాకుల: సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ఇప్పటి వరకు ఇవ్వలేదని నిరసనగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం బీజేపీ నాయకులు ఆందోళన నిర్వహించారు. తహసీల్దార్ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు బోయ రమేష్, గట్టు మల్లేష్, గుడిబండ రవి, సురేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ధర్మేందర్, శ్రీనివాసులు, సుందరయ్య ఉన్నారు.

కేసీఆర్, ఆల చిత్రపటాలకు క్షీరాభిషేకం

అడ్డాకుల: మూసాపేట మండలం తాళ్లగడ్డకు వెళ్లే దారిలో గంగారం చెరువు కట్ట నిర్మించిన బ్రిడ్జి వద్ద మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిచిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే బ్రిడ్జి మంజూరు చేయించి 95శాతం పనులు పూర్తి చేయిస్తే కాంగ్రెస్ నాయకులు శిలాఫలకాన్ని పెట్టుకుని ప్రారంభోత్సవం చేస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులు విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సింహ, మాజీ జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, కొండయ్య, శివరాములు, రవీందర్‌గౌడ్, ఉన్నారు.

గుడికి మంచినీటి సౌకర్యం

భూత్పూర్: పట్టణంలోని పోచమ్మ గుడికి సత్తూర్ రాములమ్మ, వెంకటయ్యగౌడ్‌ల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు మంగళవారం మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. పోచమ్మగుడి వద్ద భక్తులు ఇబ్బందులు పడకుండా రాములమ్మ, వెంకటయ్యగౌడ్ కుమారులు శివాజీగౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, సదానంద్‌గౌడ్‌లు రూ.50వేలతో మంచినీటి ట్యాంకు నిర్మించి, ప్రత్యేక నీటి పైప్‌లైన్ ద్వారా ఏర్పాటు చేశారు.భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

ఎస్టీ గురుకులంలో తుల్జాభవాని వేడుకలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని బా లికల ఎస్టీ గురుకులంలో తుల్జాభవాని మాత వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈమేరకు పలువురు విద్యార్థులు చేసిన సంస్కృతిక నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా గురుకుల ప్రిన్సిపాల్ వాణి సరళ మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పాత పాలమూరులో దరఖాస్తు చేసుకున్న పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బొల్లె చంద్రకాంత్ కోరారు. మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో సర్వే నిర్వహించగా వివిధ సమస్యలు వెలుగు చూశాయన్నారు. కార్యక్రమంలో ఏ.విష్ణువర్ధన్, చిన్న, డప్పు మన్యం, గోపాల్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపు అడ్డుకున్న గ్రామస్తులు

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలోని కురుమూర్తి స్వామి గుట్టల వెనకభాగంలో ఉన్న తిప్పగుట్ట నుంచి మంగళవారం మదనాపురం మండలం కొన్నూర్ గ్రామ రోడ్డు పనులకు అనుమతి లేకుండా కాంట్రాక్టర్లు మట్టిని తరలించారు. గమనించిన గ్రామస్తులు మట్టి తరలింపును అడ్డుకున్నారు. వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆర్ఐ తిరుపతయ్య సంఘటన స్థలానికి చేరుకొని మట్టి తరలింపును నిలిపివేశారు. అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని తహసీల్దార్ ఎల్లయ్య హెచ్చరించారు.

వైభవంగా శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు





త్రైత సిద్ధాంతం ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక మహబూబ్‌నగర్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమ పల్లకీసేవ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. స్థానిక పద్మావతీకాలనీలోని వేదిక వద్ద ఈనెల 16న శ్రీకృష్ణజన్మాష్టమి నుంచి స్వామివారికి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 11వ రోజు పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. పద్మావతీ కాలనీ నుంచి ప్రారంభమైన పల్లకీసేవ శ్రీనివాస కాలనీ, మెట్టుగడ్డ, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, న్యూటౌన్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు తిరిగి కార్యాలయం వరకు నిర్వహించారు. ఊరేగింపులో భక్తుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కోలాటాలు, భజనలు, భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ఇందూ జ్ఞాన వేదిక మహబూబ్‌నగర్ కమిటీ అధ్యక్షుడు నాగ్యనాయక్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, సాయిశంకర్, రాఘవేందర్, తిరుపతయ్య, బుచ్చిలింగం, యాద య్య, కిశోర్, శ్రీనివాసులు, ఉదయ్‌కుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు. - స్టేషన్ మహబూబ్‌నగర్

కాంగ్రెస్ నిర్లక్ష్యంతోనే యూరియా కొరత

చిన్నచింతకుంట: కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే యూరియ కొరత ఏర్పడిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోట రాము ఆరోపించారు. మంగళవారం యూరియా కొరతపై మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం మండల వ్యవసాయ కార్యాలయం వద్ద ఏఈఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కర్ణాకర్‌రెడ్డి, మాజీ సర్పంచులు మోహన్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, అజయ్‌కుమార్‌రెడ్డి, చంద్రాయుడు, ఇబ్రహీం, రియాజ్, లక్ష్మణ్ ఉన్నారు.

మన ఆరోగ్యం మనచేతుల్లోనే..

రాజాపూర్: పరిసరాల పరిశుభ్రతతో పాటు మనం తీసుకునే ఆహార అలవాట్లతో మన ఆరోగ్యాన్ని కాపాడుకునేది మన చేతుల్లోనే ఉంటుందని రాజాపూర్ మండల వైద్యాధికారి డాక్టర్ సుష్మిత పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, 8వ తరగతి విద్యార్థులకు స్థానిక పీహెచ్‌సీలో విద్యార్థులకు ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా పలు సూచనలు చేశారు. ప్రధానోపాధ్యాయులు సయ్యద్ ఇబ్రహీం, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

గొర్రెలకు, మేకలకు వ్యాక్సిన్

మిడ్జిల్: మండలంలోని అన్ని గ్రామాలలో గొర్రెలకు, మేకలకు పీపీఆర్ వ్యాక్సిన్ కార్యక్రమం మంగళవారం మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో ప్రారంభించినట్లు పశువైద్యాధికారి శివరాజ్ తెలిపారు. గొర్రెలకు, మేకలకు పీపీఆర్ వాక్సిన్ ఇవ్వడం వల్ల జ్వరం, న్యూమోనియా, విరేచనాలు తదితర లక్షణాల నుంచి రక్షించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గొర్రెల కాపర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొల్లూర్‌లో టీబీ క్యాంప్

నవాబుపేట: మండలంలోని కొల్లూర్ గ్రామంలో మంగళవారం వైద్యాధికారుల బృందం టీబీ ప్రత్యేక క్యాంపును ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ ప్రత్యేక క్యాంపు నిర్వహించినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో 273 మందికి ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాస్, రాములు, శరభలింగం, తదితరులు ఉన్నారు.

29న ఎస్‌జీఎఫ్ క్రీడలు

మిడ్జిల్: మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు ఈనెల 29న మిడ్జిల్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు పీడీ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ -14, అండర్- 16 బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 29న క్రీడలు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు.

డ్రాగన్ షోటోకాన్ విద్యార్థుల ప్రతిభ



మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో ఇటీవల జరిగిన నేషనల్ లెవల్ కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన డ్రాగన్ షోటోకాన్ విద్యార్థుల ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు డ్రాగన్‌షోటోకాన్ మహబూబ్‌నగర్ అర్బన్ అధ్యక్షుడు, సీనియర్ మాస్టర్ ఎస్‌కే.మోసీన్ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను మంగళవారం స్థానిక ఎంవీఎస్ కళాశాల మైదానంలో అభినందించారు. ఈ పోటీల్లో నలుగురు విద్యార్థులు గ్రాండ్ చాంపియన్‌షిప్‌లు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలురలో పదేళ్లలోపు విభాగంలో ఎస్.అఖిలేష్, 14 ఏళ్ల పైబడి విభాగంలో సాయి చరణ్, బాలికల్లో 14 ఏళ్ల లోపు విభాగంలో ఫలక్, 14 ఏళ్లపైబడి విభాగంలో షాఫియాలు గ్రాండ్ చాంపియన్‌షిప్‌లు పొందినట్లు తెలిపారు. కుమితేలో ఆయా విభాగాల్లో అఖిలేష్, జువేరియా హుస్నా, ఫలక్, షాఫియా, సాయిచరణ్ బంగారు పతకాలు, ఎండీ.మక్సూద్, కె.వరుణ్, ఆరోహి రజత పతకాలు, ఎం.విదిత్, రుబన్ కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు.

అభివృద్ధిలో తెలంగాణ ముందంజ



నూతన భవనం శిలాఫలకం ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యేలు

హన్వాడ: దేశంలోని అన్ని రాష్ట్రాలోకెల్లా.. తెలంగాణ రాష్ట్రమే అభివృద్ధిలో మొదటిస్థానంలో ఉందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఎంపీ డీకే అరుణతో కలిసి మండలంలోని కారంతండా, ఎల్లంబాయితండాల్లో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు రేషన్‌కార్డులు, ఇళ్లు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రాష్ట్ర ఖజానాకు పెద్ద గండి పెట్టి ప్రజలను నిలువునా ముంచారని ఆరోపించారు.

ముడా నిధులతో శంకుస్థాపన..

మండలంలోని అంబటోనిపల్లి, అమ్మాపూర్, లింగన్నపల్లి గ్రామాల్లో రూ.10లక్షల వ్యయంతో మల్టీపర్పస్ షెడ్‌ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు ఎం సురేందర్‌రెడ్డి, ఎన్పీ వెంకటేష్, డీసీసీ ప్రధానకార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, మండల అధ్యక్షుడు మహేందర్, ఎంపీడీఓ యశోద, మండల నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

రాజాపూర్: జడ్చర్ల నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలన్నదే తన ప్రధాన లక్ష్యమని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గుండ్లపొట్లపల్లిలో అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన, 16 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు, రాయికుంటతండాలో సీసీ రోడ్డు ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల వెనకబడ్డ జడ్చర్ల అభివృద్ధికి కావాల్సిన నిధులు తీసుకొచ్చి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నానన్నారు. ఇప్పటికే ఎడ్యుకేషన్‌హబ్‌గా పెద్దాయపల్లిలో యంగ్‌ఇండియా ఇంటి గ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేసుకున్నామన్నారు. నవోదయ ఇంటర్ నేషనల్ స్కూల్ మంజూరైందని, ఇటీవల రాజాపూర్ మండలంలో ఏటీసీ సెంటర్‌కూడా మంజూరు చేయించినట్లు తెలిపారు. అంతేకాకుండా జడ్చర్లలో బైపాస్ రోడ్డు ఏర్పాటు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్ నాయక్, నరహరి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ కేసులతో కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలు



జిల్లా జైలు వద్దకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే ఆల, మండల నాయకులు

దేవరకద్ర: కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తరువాత ప్రజా పాలన పేరుతో మోసపూరిత హామీలు ఇచ్చి అవి నేరవేర్చకుండా బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. దేవరకద్ర మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించారని ఆరోపించారు. జిల్లా జైలులో ఉన్న నర్సింహారెడ్డిని మంగళవారం కలిసి పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని ఆధైర్య పడొద్దని సూచించారు. ఆయనతో పాటు మండల బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



భూత్పూర్ చౌరస్తాలో అఘోరీల నృత్య ప్రదర్శన



కౌకుంట్లలో ..

దేవరకద్ర/దేవరకద్ర రూరల్/ భూత్పూర్/అడ్డాకుల/చిన్నచింతకుంట: భూత్పూర్ పట్టణంలో మంగళవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో చౌరస్తాలో ఆఘోరీల ప్రదర్శ, మహిళలల నృత్యాలతో పోచమ్మ దేవాలయం వరకు ఊరేగింపుగా చేశారు. ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

- అడ్డాకుల, మూసాపేట, జానంపేట, కందూర్, శాఖాపూర్, వేముల తదితర గ్రామాల్లో బోనాల పండగను ఘనంగా నిర్వహించారు.
- చిన్నచింతకుంట, కౌకుంట్ల, తిర్మలాపురంలో బోనాల పండగను ఘనంగా నిర్వహించారు.
- కౌకుంట్ల మండల కేంద్రంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.
- దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని బల్సుపల్లిలో బోనాల పండుగ నిర్వహించారు.

మట్టి విగ్రహాల పంపిణీ



స్టేషన్ మహబూబ్‌నగర్: లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబ్‌నగర్, సుప్రభాత్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ద్వారకామాయి బాబా మందిరంలోని లయన్ భవన్‌లో మంగళవారం మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబ్‌నగర్ అధ్యక్షుడు సుదర్శన్ యాదవ్, సుప్రభాత్ క్లబ్ అధ్యక్షులు రుద్రోజీ, అశోక్‌కుమార్ యాదవ్, గోవర్ధన్ చారి, మండ్ల రాములు, చెన్నయ్య, శివకుమార్, చంద్రకాంత్‌రెడ్డి, హన్మంతు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

పాలమూరు: జిల్లా కేంద్రంలోని బీకే రెడ్డి కాలనీలో హ్యాపీహోం అపార్ట్‌మెంట్ సమీపంలో శ్రీ సిద్ధి వినాయక దేవాలయంలో మంగళవారం ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గణపతిబప్పా మోరియా



నవాబుపేట: గణపతిబప్పా మోరియా అంటూ చిన్నారులు వినాయకుడి ఆకారంలో కూర్చుని వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. మండల కేంద్రంలోని గీతాంజలి, చాణుక్యా పాఠశాలల విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపి ఆకట్టుకున్నారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలోని వాసవికన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ప్రతి ఏటా పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆలయంలో మండల ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ చేస్తామని జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పాలాది రాంమోహన్ తెలిపారు.

మండలాన్ని ఒకటి చేయాలి



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

గండీడ్: గండీడ్ మండలం ఒక జిల్లా పరిధిలో దాని అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలు వికారాబాద్ జిల్లాలో ఉండడం వల్ల మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాములు, లక్ష్మయ్య, సంజీవ్‌రెడ్డి, ఈశ్వరప్ప, శంకర్‌నాయక్, మహిపాల్‌గౌడ్, శేఖర్, కృష్ణారెడ్డి, ప్రభునాయక్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీని బలోపేతం చేయాలి



కొనగట్టుపల్లిలో వాటర్‌ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ

హన్వాడ: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తెలిపారు. మంగళవారం ఆమె మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొనగట్టుపల్లిలో వాటర్‌ప్లాంటు ప్రారంభోత్సవం, అనంతరం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

క్రీడకారులను అభినందించిన ఎంపీ

పాలమూరు: బొల్లారం కేవీఎస్‌లో జరిగిన జాతీయ స్థాయి అర్చరీలో పోటీలలో జాతీయ స్థాయిలో మెరిసిన పాలమూరు క్రీడాకారులను ఎంపీ కార్యాలయంలో ఎంపీ డీకే అరుణ అభినందించారు. అండర్ 14 పోటీలలో బంగారం పతకం సాధించిన సానిభ, వెండి, రాగి పతకం సాధించిన కృతిక శ్రీవాత్సవ్‌లను సత్కరించారు.

- జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీ ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీ చిన్నారులకు మట్టి గణనాథులను పంపిణీ చేశారు.
- ఎంపీ డీకే అరుణ సమక్షంలో పట్టణంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఎదిర గ్రామానికి చెందిన యువకులను ఎంపీ పార్టీలోకి ఆహ్వానించారు.
- జిల్లా కేంద్రంలోని అశోక్ టాకీస్ చౌరస్తాలోని అంబా భవాని దేవాలయంలో రూ.10లక్షలతో నిర్మించనున్న మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎంపీ డీకే అరుణ భూమి పూజ చేశారు.

ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య



టీఎల్ఎంను ఎంఈఓ కృష్ణయ్య, ఏఎంఓ శ్రీనివాస్‌కు వివరిస్తున్న ఉపాధ్యాయురాలు



దేవరకద్రలో జరిగిన టీఎల్ఎం మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్‌లో టీఎల్‌ఎమ్ మేళాలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు కల్పిస్తూ విద్యకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తిని పెంచడానికి సులభ తరంగా అర్థమయ్యేందుకు టీచింగ్, లర్నింగ్ మెటీరియల్ ఎంతో ఉపయోగ పడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఏఎమ్ఓ శ్రీనివాస్, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ బలరాం, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కనుల పండువగా టీఎల్ఎం మేళా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని వివిధ పాఠశాలలకు సంబంధించి టీఎల్ఎం (టీచింగ్ లర్నింగ్ మెటీరియల్) మేళా కనుల పండువగా నిర్వహించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: టీచింగ్ లర్నింగ్ మెటీరియల్‌తో విద్యార్థులు విద్యను సులువుగా నేర్చుకోవచ్చని ఎంఈఓ రాజునాయక్ తెలిపారు.

మహిళపై దాడి: కేసు నమోదు

జడ్చర్ల: స్థానిక ఎర్రగుట్ట వద్ద డబుల్‌బెడ్రూం ఇళ్ల కాలనీలో నివాసం ఉంటున్న సప్పిడి సంజనపై దాడి చేసిన నీరటి వెంకటరాములుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు. ఉద్దేశ పూర్వకంగా గ్యాస్ సిలిండర్ తీసుకొచ్చి సంజన ఉంటున్న దగ్గర గ్యాస్ లీక్ చేసి నిప్పు పెట్టే ప్రయత్నం చేయగా తప్పించుకున్నట్లు బాధిత మహిళ ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

వార్డు వారీగా ఓటర్ లిస్టు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): స్థానిక సంస్థల ఎన్నికల కసరత్తును జరుగుతోంది. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన సిద్ధంగా ఉండేందుకు అధికార యంత్రాంగం అన్ని సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా గ్రామ పంచాయతీల్లో ఓటర్ జాబితాతోపాటు పోలింగ్ స్టేషన్ల గుర్తింపునకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 28న గ్రామాల్లో వార్డుల వారీగా ఓటర్ జాబితాను ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రచురించాలి. 29న జిల్లా స్థాయి రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలి. 30న మండల స్థాయి రాజకీయ పార్టీలతో అఖిల పక్ష సమావేశాలు నిర్వహించాలి. ఈనెల 28 నుంచి 30వరకు ఓటర్ జాబితాలో అభ్యంతరాలు స్వీకరించాలి. 31న డీపీఓ కార్యాలయంలో తుది నివేదిక సమర్పించాలి. సెప్టెంబర్ 2న వార్డు వారీగా తుది ఓటర్ జాబితాతో పాటు తుది పోలింగ్ స్టేషన్ల జాబితాను జిల్లా పంచాయతీ శాఖ కార్యాలయంలో పబ్లిష్ చేస్తారు.

ఫ్రేమ్ వర్క్ ముసాయిదా ప్రతులు దహనం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: యూజీసీ విడుదల చేసిన ఎల్‌ఓసీఎఫ్ (లర్నింగ్ ఔట్‌కమ్స్ కరిక్యులమ్) ఫ్రేమ్ వర్క్ ముసాయిదాను వెంటనే రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేస్తూ, ముసాయిదా ప్రతులను దహనం చేశారు. పీయూలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యక్షుడు బత్తిని రాము మాట్లాడుతూ ముసాయిదా మూఢనమ్మకాలు, అవిజ్ఞానికమైనదని, తొమ్మిది సబ్జెక్టుల కోసం ఎల్‌ఓసీఎఫ్‌ను ముసాయిదా విడుదల చేశారన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా మతపరమైన అంశాలు, సావర్కర్, ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ కథనాలను పొందుపర్చారని, అనేక అంశాలను వదిలిపెట్టి సంబంధం లేని అంశాలను ఉంచారని, దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయ కులు శ్రీనివాస, రాంచందర్, రమేష్, ఆంజనేయులు, గిరిబాబు, తిరుమలేష్ పాల్గొన్నారు.

జిల్లా ఎక్సైజ్ ఎస్సీ ఉద్యోగుల సంఘం ఎన్నిక

పాలమూరు: జిల్లా ఎక్సైజ్ ఎస్సీ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం మంగళవారం పట్టణంలోని టీఎన్జీఓ భవనంలో రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా అశోక్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా అంజిలయ్య, కోశాధికారిగా కేశవులు, అసోసియేట్ ప్రెసిడెంట్ కల్యాణ్, ఉపాధ్యక్షులుగా కరుణ, మురళీమోహన్, కళానందం, కార్యనిర్వాహక కార్యదర్శిగా శివకుమార్, సంయుక్త కార్యదర్శులుగా శివకుమార్, సునీత, ప్రచార కార్యదర్శులుగా ఏలియా, శ్యామల, ఈసీ సభ్యులను ఎన్నుకున్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం చేద్దాం

స్టేషన్ మహబూబ్‌నగర్: మిలాదున్నబీ వేడుకలను పురస్కరించుకొని ఈనెల 31న హైదరాబాద్‌లోని ఫలక్‌నుమాలో జరిగే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేద్దామని బజ్మె ఖాద్రియా కాజ్మియా జిల్లా అధ్యక్షుడు జహంగీర్‌పాష ఖాద్రీ అన్నారు. రక్తదాన శిబిరంలో ఉమ్మడి జిల్లా నుంచి పాల్గొనడానికి వెళ్లే వారి కోసం ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రం నుంచి బస్సు బయలుదేరుతుందని తెలిపారు. మిగతా వివరాల కోసం 9849301171, 7036604920 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. సమావేశంలో సయ్యద్ అబ్దుల్ ఖుద్దూస్ ఖాద్రీ, ఖాజా మొయినొద్దీన్, మహ్మద్ ఇలియాజ్ ముజాహిద్ ఖాద్రీ, మోసీన్ కాజ్మి, ఖాజ, అస్గర్, జమీల్, మొయిజ్ తదితరులు పాల్గొన్నారు.

5న మిలాదున్నబీ వేడుకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: మిలాదున్నబీ వేడుకలు జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహిస్తామని మజ్లిస్ అహ్లె సున్నత్‌వల్ జమాత్ మిలాద్ జులూస్ జల్సా కమిటీ ప్రతినిధులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని షాషాబ్‌గుట్ట దర్గా ఆవరణలో మంగళవారం కమిటీ సమావేశం నిర్వహించారు. మిలాద్ జులూస్ నిర్వహణ, ధార్మిక సభ గురించి సమావేశంలో చర్చించారు. పలువురు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో వచ్చేనెల 5న మిలాద్ జులూస్ ఊరేగింపు నిర్వహించడానికి కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించినట్లు తెలిపారు. సమావేశంలో పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. సమావేశంలో కమిటీ చీఫ్ ప్యాట్రన్ సయ్యద్ అబ్దుల్ రజాక్‌షా ఖాద్రీ, అధ్యక్షుడు మజహర్ హుస్సేన్ షహీద్, కార్యదర్శి ఖాజా ఫయాజుద్దీన్ అన్వర్‌పాషా, ఉపాధ్యక్షులు రఫిక్ పటేల్, వర్కింగ్ ప్రెసిడెంట్ అఫ్రోజ్‌షా, ఎంఏఎం జిల్లా అధ్యక్షులు అబ్దుల్ హాదీ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా జడ్చర్ల ప్రెస్‌క్లబ్ ఎన్నికలు

- అధ్యక్షుడిగా కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా సుల్తాన్



జడ్చర్ల టౌన్: జడ్చర్ల ప్రెస్‌క్లబ్‌కు మంగళవారం హోరాహోరీగా కొనసాగాయి. ఎన్నికల్లో అధ్యక్షుడిగా వి.కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా సుల్తాన్‌లు ఎన్నికయ్యారు. మొత్తం 51మంది సభ్యులు ఉన్న క్లబ్‌లో అధ్యక్ష స్థానానికి కృష్ణయ్య, పాలాది రమేష్, పి. శ్రీధర్, ఆర్.నరేందర్‌గౌడ్‌లు పోటీ పడ్డారు. వారిలో 6 ఓట్ల మెజార్టీతో కృష్ణయ్య గెలిచారు. ప్రధాన కార్యదర్శికి సుల్తాన్ ఎడ్లబాబయ్యలు పోటీ పడగా 5 ఓట్లు నోటాకు పోలయ్యాయి. మిగిలిన 46 ఓట్లలో ఇద్దరు అభ్యర్థులకు సమానంగా 23 ఓట్లు పోలయ్యాయి. టాస్ ద్వారా సుల్తాన్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వెంకటరమణాచార్యులు, పరిశీలకులు తిరుపతయ్య, సహ ఎన్నికల అధికారి జీనురాల సత్యం ప్రకటించారు. వీరితోపాటు ఇదివరకే వైస్‌ప్రెసిడెంట్‌గా శేఖర్, సంయుక్త కార్యదర్శిగా మల్లేష్, కోశాధికారిగా ప్రభాకర్‌లు ఏకగ్రీవమయ్యారు. ఐదుగురికి విజయపత్రాలు ఎన్నికల అధికారులు అందజేశారు. ఎన్నికకు సంబంధించిన ఫోర్‌మెన్‌కమిటీ శశిధర్‌రెడ్డి, కరీం, సురేందర్, సత్తార్‌లు వ్యవహరించారు. ప్రెస్‌క్లబ్ సభ్యుల సంక్షేమం కోసం కృషిచేస్తామని నూతన కార్యవర్గం ప్రకటించింది.